సాక్షి
నిర్మల్
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023

గోమయ గణపతిని పూజిద్దాం



పర్యావరణహితంగా ప్రకృతికి ఎలాంటి హాని కలిగించని గోమయ లేదా మట్టి గణపతులను పూజించాలని క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్య రెడ్డి సూచించారు.

IIలో▸

పేరెంట్స్ మీటింగ్ వాయిదా

నిర్మల్ రూరల్: ఈ నెలకు సంబంధించి మూడో శనివారం(16న) నిర్వహించాల్సిన పేరెంట్స్ మీటింగ్ వాయిదా వేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయుల బదిలీలు ఉన్నందున ఈసారి మూడో శనివారానికి బదులు నాలుగో శనివారం (23న) సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.3 /24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి నిధుల కోసం కేటీఆర్‌కు వినతి



మంత్రి కేటీఆర్‌తో జాబీర్‌అహ్మద్

భైంసాటౌన్: భైంసా పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.జాబీర్‌అహ్మద్ రాష్ట్ర పురపాలక మంత్రి కేటీఆర్‌ను కోరారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భైంసా పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, అవసరమైన నిధులు, తదితర అంశాలపై చర్చించారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యుడు ఇంతియాజ్ ఉన్నారు.

25 నుంచి ఆశ వర్కర్ల సమ్మె



సమ్మె నోటీస్ అందిస్తున్న ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 25 నుంచి ఆశ వర్కర్లు నిరవధిక సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ తెలిపారు. ఈమేరకు సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందికి గురువారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశ వర్కర్లకు పారితోషకం రూ.18 వేలకు పెంచాలని కోరారు.

16న 'జీవనభృతి' పోరాటం

- తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి కె.రాజన్న

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2,016 జీవన భృతి ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో గురువారం మాట్లాడారు. తొమ్మిదేళ్లలో ఒక్కరికి కూడా కొత్తగా జీవన భృతి మంజూరు చేయలేదన్నారు. 2018 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కేసీఆర్ విస్మరించారని తెలిపారు. అందరికీ జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 16న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జిల్లాకు మెడికళ..!

- ఇక మన దగ్గరే.. డాక్టర్ చదువు
- అందుబాటులోకి మెడికల్ కాలేజీ
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి 'అల్లోల'
- కాలేజీ మంజూరులో 'సాక్షి' పాత్ర



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మెడికల్ కళాశాల

నిర్మల్/నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. చదువులమ్మ కొలువైన గడ్డపై ఇక వైద్య విద్య చదువుకునే అవకాశం కలిగింది. పేద, మధ్యతరగతి బిడ్డలు సైతం స్టెతస్కోప్ మెడలో వేసుకునే సమయం ఆసన్నమైంది. పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందనుంది. ఏళ్లుగా జిల్లా ఎదురుచూస్తున్న ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల అట్టహాసంగా ప్రారంభమవుతోంది. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించనున్నారు. దీంతో అన్నిరంగాల్లో దూసుకుపోతున్న జిల్లాకు 'మెడి'కళ రానుంది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీని అట్టహాసంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈమేరకు చేసిన ఏర్పాట్లను మంత్రి, కలెక్టర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. నిర్మల్ మెడికల్ కళాశాల ఏర్పాటులో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చొరవతో పాటు 'సాక్షి' వరుస కథనాలు కీలక పాత్ర పోషించాయి.

వందమంది విద్యార్థులతో...

జిల్లా కేంద్రంలోని భీమన్నగుట్ట సమీపంలో సకల సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన భవనంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభమవుతోంది. ప్రస్తుత జిల్లా ఆస్పత్రినే బోధన ఆస్పత్రిగా మార్చి సేవలందించనున్నారు. దీంతో జిల్లాలో వైద్యవిద్యతోపాటు పేదలకు ఉచితంగా కార్పొరేట్‌స్థాయి వైద్యం అందనుంది. మొత్తం వందమంది విద్యార్థులతో ఫస్టియర్ తరగతుల కోసం శుక్రవారం కాలేజీని ప్రారంభించనున్నారు. శనివారం నుంచి ఈ నెలాఖరు వరకు విద్యార్థులకు పరిచయ తరగతులు నిర్వహించనున్నారు. అక్టోబర్ ఒకటి నుంచి రెగ్యులర్ తరగతులు కొనసాగుతాయని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవీడీఎస్.ప్రసాద్ తెలిపారు.

మూడు విడతల్లో 80 మంది చేరిక...

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే మూడు విడతలు పూర్తికాగా, గురువారం నాటికి నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 80 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారు. మూడోవిడత కౌన్సెలింగ్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈనెల 28 వరకు చేరే అవకాశం కల్పించారు. మూడో విడతలో సీట్లు మిగిలితే నాలుగో విడతలో భర్తీ చేస్తారు.

అన్ని సౌకర్యాలతో..

మెడికల్ కళాశాలలో టీచింగ్, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది ఇప్పటికే నియమితులయ్యారు. వైద్యవిద్యకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ ఏర్పాటు చేశారు. కళాశాల భవనంలో రెండు లెక్చర్ హాళ్లు, అనాటమీ, డిసెక్షన్ హాల్, డైనింగ్‌హాళ్లు, హిస్టాలజీ ల్యాబ్, హెమటాలజీ ల్యాబ్, రెండు డెమో రూములు, విద్యార్థుల లాకర్ రూములు, రిసెప్షన్ హాల్, బయోకెమిస్ట్రీ ల్యాబ్, లైబ్రరీతోపాటు ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ స్టాఫ్ గదులు అందుబాటులోకి వచ్చాయి. హాస్టళ్ల విషయంలో విద్యార్థుల కోసం ప్రస్తుతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. బాలుర కోసం జిల్లా ఆస్పత్రి రెండోఅంతస్తులో, బాలికలకు పాలిటెక్నిక్ కళాశాల భవనంలో హాస్టల్ వసతి కల్పించారు. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హాస్టల్ వార్డెన్లుగా వ్యవహరించనున్నారు.

మెరుగైన వైద్యం..

జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ రావడంతో విద్యార్థులకు వైద్యవిద్యతోపాటు పేదలకు మరింత మెరుగైన వైద్యమూ అందనుంది. ఇప్పటికే జిల్లా ఆస్పత్రి భవనాన్ని 330 పడకల బోధనాసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఒక్కొక్కటిగా అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం 12 వైద్య సేవలు కొనసాగుతుండగా, బోధనాసుపత్రి ద్వారా 26 రకాల వైద్యసేవలు ప్రజలకు అందనున్నాయి. ఆర్థోపెడిక్, ఎమర్జెన్సీ, ట్రామా, క్రిటికల్ కేర్, అప్తమాలజీ, డెర్మటాలజీ, డెంటిస్ట్, అనస్తీషియా, అనాటమీ, జనరల్ సర్జరీ, న్యూరోలజీ, గైనకాలజీ, ఎండోక్రైనోలజీ, ఈఎన్‌టీ, లెప్రసీ, క్యాజువాలిటీ, యూరాలజీ, టీబీ క్లినిక్, బ్లడ్ బ్యాంక్ తదితర విభాగాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

రెండేళ్లల్లో పూర్తిస్థాయిలో..

జిల్లాలో ప్రారంభమవుతున్న మెడికల్ కాలేజీకి పూర్తిస్థాయిలో శాశ్వత భవనం రెండేళ్లలో అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం భీమన్నగుట్ట పక్కన ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ భవనం అంతకుముందు జిల్లా ఆస్పత్రి కోసం కేటాయించింది. ఐదెకరాల స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ నూతన జిల్లా ఆస్పత్రి భవనం కోసం వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాకు మెడికల్ కాలేజీ కేటాయించడంతో అదేస్థలంలో రూ.40 కోట్లతో మొదటి సంవత్సరం విద్యార్థులకు బోధనకు వీలుగా ఉండేలా నిర్మాణం మార్చారు. ప్రస్తుత విద్యార్థులు ద్వితీయ సంవత్సరానికి చేరుకునేలోపు ప్రస్తుతం నిర్మించిన భవనం చుట్టూ 20 ఎకరాలలో రూ.166 కోట్లతో శాశ్వత మెడికల్ కళాశాల భవనాలు నిర్మించనున్నారు.



వర్చువల్‌గా ప్రారంభం..

నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇప్పటికే నేషనల్ మెడికల్ కౌన్సిల్, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నుంచి పూర్తిస్థాయి అనుమతులు పొందింది. వంద సీట్ల భర్తీకి అడ్మిషన్ల ప్రక్రియ కూడా దాదాపు ముగిసింది. ఈనేపథ్యంలోనే శుక్రవారం మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్నారు. జిల్లాతోపాటు నూతనంగా ఏర్పాటైన పలు వైద్యకళాశాలలనూ సీఎం కేసీఆర్ హైదరాబాద్ నుంచే వర్చువల్‌గా ప్రారంభిస్తున్నారు.

'సాక్షి' వరుస కథనాలు..

నిర్మల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సీఎం ప్రకటించిన మూడు విడతల్లోనూ జిల్లా పేరు లేకపోవడంతో ప్రత్యేకంగా కేసీఆర్‌ను కలిసి విన్నవించారు. మరోవైపు నిర్మల్‌కు మెడికల్ కాలేజీ ఇవ్వాల్సిన అవశ్యకత ఉందని, గతంలో సీఎం హామీ ఇచ్చారని, మూడు జాబితాల్లోనూ జిల్లాకు రాలేదని.. 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. 2022, ఆగస్టు 8న 'మూడో'సారీ' శీర్షికన సాక్షి జిల్లా టాబ్లాయిడ్ బ్యానర్ కథనాన్ని ప్రచురించింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న మంత్రి అదేరోజు సీఎం కేసీఆర్, సంబంధిత అధికారులతో మాట్లాడి.. అత్యవసర, ప్రత్యేక జీవో ద్వారా నిర్మల్‌కూ మెడికల్ కాలేజీ మంజూరు చేయించారు.

వివరాలు..

గురువారం నాటికి జాయిన్ అయిన విద్యార్థులు	
స్టేట్ కోటాలో	77
ఆల్ ఇండియా కోటాలో	03
మెడికల్ కళాశాల సిబ్బంది వివరాలు	
ప్రొఫెసర్లు	03
అసోసియేట్ ప్రొఫెసర్లు	02
అసిస్టెంట్ ప్రొఫెసర్లు	20
సీనియర్ రెసిడెంట్లు	30
అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్..	
ఆఫీస్ సూపరింటెండెంట్	06
సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు	04
నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2	03
హెడ్ నర్సులు	02

అన్ని సౌకర్యాలు కల్పించాం..



ఎంబీబీఎస్ ఫస్టియర్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యవిద్య కొనసాగించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభమైన మరుసటి రోజు నుంచే పరిచయ తరగతులు, అక్టోబర్ ఒకటి నుంచి రెగ్యులర్ తరగతులు ప్రారంభిస్తాం. టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ అందుబాటులో ఉన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో బోధనాస్పత్రిగా మార్చిన జిల్లా ఆస్పత్రిలో మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.

– జీవీడీఎస్.ప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

పేదల చెంతకు వైద్య విద్య

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: డాక్టర్ కావాలనుకునే పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల చెంతకే వైద్య విద్య చేరిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. వైద్య కళాశాలను గురువారం సందర్శించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా(వర్చువల్ పద్ధతిలో) శుక్రవారం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి దివ్య గార్డెన్ వరకు ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీలో జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నిర్మల్ మెడికల్ కాలేజీలో ఇప్పటికే వంద సీట్ల కేటాయింపు పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో ధనరాజ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నేడు 32 కేంద్రాల్లో టెట్
- నిమిషం నిబంధన అమలు



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: జిల్లాలో శుక్రవారం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు అంతా సిద్ధమైంది. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా 32 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిర్మల్ డివిజన్లో 28, భైంసా డివిజన్లో 4 కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 12,197 మంది పరీక్షలు రాయనున్నారు. పేపర్–1 ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుంది. ఈ పరీక్షకు 7,611 మంది హాజరుకానున్నారు. పేపర్–2 మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. ఈ పరీక్షకు 4,586 మంది హాజరవుతారు.

గంట ముందే హాజరు కావాలి..

టెట్ రాసే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే హాజరు కావాలని అధికారులు పేర్కొంటున్నారు. నిమిషం నిబంధన అమలులో ఉందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు తీసుకురావొద్దని సూచించారు. పరీక్ష సీసీ కెమెరాల నిఘాలో జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణపై కలెక్టర్ గురువారం జిల్లా కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తోంది. పరీక్ష జరిగే కేంద్రాల పరిధిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

352 మంది ఇన్విజిలేటర్లు..

టెట్ కోసం జిల్లా వ్యాప్తంగా 352 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి నేతృత్వంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ కస్టోడియన్ అధికారిగా, డీఈవో రవీందర్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. 32 మంది చొప్పున ముఖ్య పర్యవేక్షకులు, ఆరుగురు రూట్ ఆఫీసర్లు, అదనపు రూట్ ఆఫీసర్లు ,128 మంది ప్రత్యేక అబ్జర్వర్లను కేటాయించారు. రాష్ట్ర పరిశీలకులు జిల్లాకు రానున్నారు. అభ్యర్థుల హాల్ టికెట్‌పై ఫొటో రాకపోతే దానిపై అంటించి గజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకుని, డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

టెట్ నిర్వహణపై శిక్షణ

టెట్ నిర్వహణపై జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి హాజరై సూచనలు చేశారు. అధికారులు, ఇన్విజిలేటర్లు నిబంధనల ప్రకారం పరీక్ష నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అపోహలు నమ్మకుండా, పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌తో మాత్రమే పరీక్ష రాయాలని తెలిపారు. శిక్షణలో డీఈవో రవీందర్‌రెడ్డి, పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, ఇన్విజిలేటర్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: టెట్ అభ్యర్థుల కోసం శుక్రవారం ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్, భైంసాకు ఉదయం 5 గంటల నుంచి బస్సులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మంచిర్యాలకు ఉదయం 4 గంటలకు బస్సు ఉంటుందని తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే టెట్‌కు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా వసతులు కల్పించాం. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోనికి తీసుకురావొద్దు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

అభివృద్ధికి పురస్కారం

స్వచ్ఛత.. పచ్చదనం, అభివృద్ధిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామం జిల్లాస్థాయిలో ఉత్తమ పంచాయతీగా నిలిచింది. గ్రామ పంచాయతీ కార్యాలయం, ఇంకుడు గుంతల నిర్మాణం ఇంటింటికీ మరుగుదొడ్డి, పరిసరాల పరిశుభ్రత, ఇలా అన్నిరంగాల్లో అభివృద్ధితో ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. సర్పంచ్ బొడ్డు గంగన్న, పంచాయతీ కార్యదర్శి రమాదేవి హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. - కడెం



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ గంగన్న, పంచాయతీ కార్యదర్శి రమాదేవి

ఆర్టీసీలో ఆన్‌లైన్ చెల్లింపులు

- అందుబాటులోకి రానున్న ఐ టీం మెషిన్లు
- ప్రయాణికులకు సులువు కానున్న చెల్లింపులు
- చిల్లర సమస్యకు చెక్..



భైంసాటౌన్: ప్రయాణికులను ఆకట్టుకునేందుకు టీఎస్‌ఆర్టీసీ అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. కొత్త బస్సులు అందుబాటులోకి తేవడంతో పాటు టికెట్లపై రాయితీలు అందిస్తోంది. మహిళా ప్రయాణికులను ఆకర్షించే దిశగా టీ9, టీ30 టిక్కెట్లు వంటి సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చింది. పండుగల సందర్భాల్లో లక్కీడ్రా ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు సైతం అందిస్తోంది. తద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ ఓఆర్ శాతం పెంచుకుంటోంది. తాజాగా ప్రయాణికులకు మరో శుభవార్త అందించింది. ఇకపై బస్సుల్లో ఆన్‌లైన్ పేమెంట్స్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. చిల్లర సమస్యకు చెక్ పెట్టేందుకు బస్సుల్లో ప్రయాణికులు టికెట్ కోసం ఆన్‌లైన్ పేమెంట్ చేసే అవకాశం కల్పించనుంది. ఇందుకోసం ఐటీమ్స్ పరికరాలను బస్సుల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు.

తీరనున్న చిల్లర సమస్య...

ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ చెల్లింపుల హవా నడుస్తోందంటే అతిశయోక్తి కాదు. పొద్దున పూట పాలు మొదలు, కూరగాయలు, పండ్లు, కిరాణ, నిత్యావసర సరుకులు.. ఇలా కూరగాయల కొట్టు మొదలు సూపర్‌మార్కెట్ వరకు సరుకుల కొనుగోలుకు దాదాపు అంతా ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ చేతిలో ఉంటే చాలు కరెంట్ బిల్లు చెల్లింపులు, మొబైల్ సిమ్‌కార్డుల రీచార్జి, బ్యాంకుకు వెళ్లకుండానే మనీ ట్రాన్స్‌ఫర్.. ఇలా ఏదైనా క్షణాల్లో చెల్లింపులు చేస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ చెల్లింపుల కాలంలోనూ ఆర్టీసీ మ్యానువల్‌గానే టికెట్లు ఇస్తూ వచ్చింది. ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి టికెట్ చెల్లింపులకు ఆన్‌లైన్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ప్రస్తుతం లగ్జరీ, ఏసీ బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుకింగ్ పద్ధతి అందుబాటులో ఉంది. త్వరలోనే ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా టికెట్ కోసం ఆన్‌లైన్ పేమెంట్ పద్ధతి అందుబాటులోకి తేనున్నారు. దీంతో ప్రయాణికులతోపాటు కండక్టర్లకు సైతం ఇబ్బందులు తీరనుండగా వేగవంత చెల్లింపులతో సమయాభావం తీరనుంది.

నిర్మల్ జిల్లాలో ఆర్టీసీ సమాచారం..

డిపో	ఆర్టీసీ బస్సులు	హైర్ బస్సులు
నిర్మల్	64	77
రోజువారీ ఆదాయం: రూ.20లక్షలకుపైగా (సరాసరి)		
భైంసా	33	49
రోజువారీ ఆదాయం: రూ.12లక్షలకుపైగా(సరాసరి)		

త్వరలోనే ఆన్‌లైన్ పేమెంట్ పద్ధతి..

ప్రయాణికులను ఆకట్టుకునేందుకు సంస్థ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. లగ్జరీ, ఏసీ బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉంది. త్వరలో అన్ని బస్సుల్లో క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ పేమెంట్ దిశగా సంస్థ నిర్ణయం చేస్తోంది. ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.

– సాలోమాన్ రాజ్, ఆర్ఎం, ఆదిలాబాద్

గోమయ గణపతిని పూజిద్దాం

- క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి

నిర్మల్‌టౌన్: పర్యావరణహితంగా ప్రకృతికి ఎలాంటి హానీ కలిగించని, గోమయ లేదా మట్టి గణపతులను పూజించాలని క్లీమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్య రెడ్డి సూచించా రు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్ కుమార్ హైదరాబాద్‌లోని వారి నివాసంలో గురువారం ఆమె కలిశారు. ఈ సందర్భంగా వారికి ఆమె గోమయ గణపతి ప్రతిమను అందజేశారు.

16, 17న గోమయ గణపతుల పంపిణీ

నిర్మల్ నియోజకవర్గంలో ఏటా క్లిమమ్ సంస్థ, ఐకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత గోమయ గణపతులను పంపిణీ చేయనున్నట్లు అల్లోల గౌతంరెడ్డి, సేవ్ దేశీ కౌస్ క్యాంపెనర్, క్లిమమ్ వ్యవస్థాపకురాలు అల్లోల దివ్యారెడ్డి తెలిపారు. ఎనిమిదేళ్లుగా పర్యావరణానికి హానీ చేయని విధంగా గోమయ, పసుపు, మట్టి, చింతగింజలు, వేపాకు మిశ్రమం, ఎండుగడ్డి ఉపయోగించి గణేశ్ ప్రతిమలను తయారు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వీటిని 16,17 తేదీల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సరిహద్దులో భయం భయం..

- ఝరి(బి) అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం
- మూడు మేకలు మృతి


చిరుత దాడిలో మృతిచెందిన మేక

తానూరు: మండలంలోని ఝరి(బి), బెంబర అటవీ ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం సాయంత్రం ఝరి(బి) గ్రామానికి చెందిన గుర్ల శ్రీనివాస్, బెంబర గ్రామానికి చెందిన నర్సు మేకల కాపారులు అటవీ ప్రాంతంలో మేకలను మేపేందుకు తీసుకెళ్లారు. సాయంత్రం సమయంలో గుర్ల శ్రీనివాస్‌కు చెందిన రెండు మేకలు, బెంబర గ్రామానికి చెందిన నర్సుకు సంబంధించిన మేకపై చిరుత దాడి చేసి ఎత్తుకెళ్లింది. కాపరులు ఇంటికి వచ్చి చూసేసరికి మేకలు కనిపించలేదు. దీంతో కాపరులు గురువారం ఉదయం అటవీ ప్రాంతంలోకి వెళ్లి చూడగా మూడు మేకల కళేబరాలు కనిపించాయి. దీనిని గమనించిన కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు అటవీ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. మేకలపై దాడి చేసింది చిరుతపులేనని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ విషయమై అటవీశాఖ బీట్ అధికారి మహేశ్‌ను వివరణ కోరగా గ్రామస్తులు తమకు ఆలస్యంగా సమాచారం అందించారని, శుక్రవారం అటవీ ప్రాంతానికి వెళ్లి చిరుత పాదముద్రలు పరిశీలిస్తామన్నారు.

భయంభయం..

ఝరి(బి), బెంబర గ్రామాలకు చెందిన అధిక మంది రైతుల వ్యవసాయ భూములు గుట్టప్రాంతానికి ఆనుకుని ఉన్నాయి. ఆ వైపునకు వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు. పంట పొలాల్లో సోయా, పత్తి పంటలు ఏపుగా పెరగడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఆ గ్రామాల రైతులు జంకుతున్నారు. అధికారులు అటవీ ప్రాంతంలో పర్యటించి చిరుత ఆనవాళ్లను గుర్తించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

'ఫస్ట్'కాదు.. ఫేక్‌లిస్ట్

- బీజేపీ అభ్యర్థులు వీరేనంటూ.. సోషల్ మీడియాలో వైరల్
- ఉమ్మడి జిల్లాలో పలువురి పేర్లు
- ఖండించిన బీజేపీ నాయకులు



వైరల్‌గా మారిన నకిలీ జాబితా

నిర్మల్: బీజేపీ అభ్యర్థులు తొలి జాబితా ఇదేనంటూ.. సోషల్ మీడియాలో పలువురు అభ్యర్థుల పేర్లతో వైరల్ అవుతోంది. ఇది పార్టీ ప్రకటించిన జాబితా కాదని, ఫేక్ లిస్ట్ అని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. ఈ జాబితాలో మొత్తం 11 నియోజకవర్గాలు–అభ్యర్థుల పేర్లు ఉండగా ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నియోజకవర్గాలే ఎక్కువగా ఉన్నాయి. నిర్మల్– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్–లాలా ఓంప్రకాశ్ జైస్వాల్, ఖానాపూర్(ఎస్టీ)–రాథోడ్ రమేశ్, బోథ్(ఎస్టీ)– సోయంబాపురావు, సిర్పూర్–పాల్వాయి హరీశ్‌బాబుల పేర్లు ఉన్నాయి. ఈ జాబితాను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. మిగితా నియోజకవర్గాలు కూడా అనుమానం రాకుండా ఉండేందుకు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, ఈటెల, కోమటిరెడ్డిల పేర్లు పెట్టారు. చాలామంది ఈ జాబితా వాస్తవమే అనుకుని, వారూ ఫార్వర్డ్ చేశారు. చివరకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోషల్ మీడియా ద్వారానే ఈ జాబితా పార్టీ ప్రకటన కాదని స్పష్టంచేశారు.

ఫేక్ ప్రచారాలు చేయొద్దు..

బీజేపీ అభ్యర్థులను ప్రకటించారంటూ సోషల్‌మీడియా ద్వారా నకిలీ ప్రచారాలను చేయొద్దని పార్టీ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి కోరారు. సోషల్‌మీడియాలో గురువారం వైరల్ అయిన జాబితాపై ఆమె స్పందిస్తూ ఇది పూర్తిగా ఫేక్ అన్నారు. పార్టీ ఏ విషయాన్నైన్నా ప్రజలందరికీ తెలిసేలా ప్రకటిస్తుందన్నారు. ఇలాంటి నకిలీ ప్రచారాలతో ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం


రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

ఖానాపూర్: తిరుమల తిరుపతి దేవస్థానం పిలుపు మేరకు చేపట్టిన కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞంలో భాగంగా పట్టణంలోని శ్రీలక్ష్మివేంకటేశ్వర ఆలయంలో హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం గురువారం ఘనంగా జరిగింది. అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామిజీ పాల్గొని భక్తులకు ఉపదేశించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకుని భక్తి మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ చేరుకున్న రథానికి స్థానిక భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు ఆలయంలో అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు చక్రపాణి నర్సింహమూర్తి, రాజశేఖర్‌శర్మ, సందీప్‌శర్మ, నాయకులు మంత్రరాజం సురేశ్, శెట్టి శ్యామ్, అంకం రాజేందర్, కొక్కుల ప్రదీప్, మహాజన్ జితేందర్, మడిగెల గంగాధర్, పెరిక గంగాధర్, అడ్డగట్ల రాజన్న, కొండ సురేశ్, కట్కం శేఖరయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రభాకర్, అనిల్‌రావు, రాజు, చంద్రహస్, పరమేశ్వర్‌గౌడ్, తదితరులున్నారు.

పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: నూతనంగా పోడుపట్టాలు పొందిన రైతులకు పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్థిక సహాయ పథకం, పంట రుణాలు మంజూరుపై గిరిజన సంక్షేమ, ఉమ్మడి జిల్లా బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్హులైన గిరిజన లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకాలకు యూనిట్లను మంజూరు చేయ డం జరిగిందని, నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలు, బ్యాంకుల వారీగా లక్ష్యాలను చర్చించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, ఏఓ రాంబాబు, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

- స్పష్టం చేసిన అంగన్‌వాడీ వర్కర్లు
- సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమిస్తామని అంగన్‌వాడీ వర్కర్లు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె శిబి రం నుంచి సీడీపీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం ఎన్టీఆర్‌చౌక్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ మాట్లాడుతూ ఇప్పటికైనా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, ఉ పాధ్యక్షులు లావణ్య, రమ్య, భాగ్య, హేమల త, నర్సమ్మ, భాగ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు పద్మ, హేమలత పాల్గొన్నారు.

ముగిసిన 'తొలిమెట్టు' శిక్షణ

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో మూడు రోజులు గా నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న తొలిమెట్టు కార్యక్రమంపై జిల్లా విద్యాశాఖ, రూమ్ టు రీడ్ సంస్థ అధ్వర్యంలో తెలుగు సబ్జెక్టు రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ఇచ్చారు. సెక్టోరియల్ అధికారి నర్సయ్య మాట్లాడుతూ తరగతి గదిలో బోధన అభ్యసన సామగ్రి ఉపయోగిస్తూ బోధించాలని సూచించారు. ప్రభుత్వం అందించిన అభ్యాస పుస్తకాలను విద్యార్థులతో చేయించాలని తెలిపారు. రూమ్ టు రీడ్ సంస్థ అందించిన గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులందరూ ఉపయోగించుకునేలా చూడాలన్నారు. రూమ్ టు రీడ్ జిల్లా ఇన్‌చార్జి గోనె రవి, రిసోర్స్ పర్సన్స్ సంగీత, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'విజయభేరి' సన్నాహక సమావేశం వాయిదా

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో శుక్రవారం తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ విజయభేరి' సన్నాహక సమావేశం వాయిదా వేసినట్లు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తుక్కుగూడ బహిరంగ సభ ప్రచార బాధ్యతలు అప్పగించడంతో ఆయన సన్నాహక సమావేశానికి హాజరు కాలేకపోతున్నారని పేర్కొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి

ఇంద్రవెల్లి: జ్వరంతో చిన్నారి మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన సోన్‌కాంబ్లే రాష్ట్రపాల్, సునీత దంపతులకు శృతి(8), దీక్షిత్, ప్రణిత్ సంతానం ఉన్నారు. శృతి మండల కేంద్రంలోని హోలీ ట్రినిటి చర్చ్‌లో రెండో తరగతి చదువుతోంది. శృతి వారంరోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించినా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో ఈ నెల 11న ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

శతాధిక వృద్ధురాలు మృతి

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన శతాధికి వృద్ధురాలు లడే వార్ లింగమ్మ(103) గురువా రం మృతిచెందింది. లింగమ్మకు ఆరుగురు కుమారులు, ఆరుగు రు కుమార్తెలు ఉన్నారు. కోడళ్లు, మనుమళ్లు, మునిమనవలు, మనవరాళ్లు మొత్తం 152 మంది కుటుంబ సభ్యులున్నారు. వందళ్లు దాటినా.. ఆమె తన పని తాను చేసుకునేదని కుటుంబీకులు పేర్కొన్నారు. వయస్సు సహకరించకపోవడంతో గురువారం తుదిశ్వాస విడిచింది.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శిబిరంలో పాల్గొన్న జడ్జి జితిన్

ఖానాపూర్: పుట్టుకతో వచ్చిన సమస్యలతోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడే వారు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ కోర్టు జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. ప్రపంచ చెవిటి దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జడ్జి హాజరై ప్రారంభించారు. కళ్లు, చెవులు, తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యారోగ్య శాఖ సిబ్బంది ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కామేష్, సిబ్బంది చంద్రకాంత్, జయలలిత, న్యాయవాదులు బాశెట్టి శివ, రాజలింగం, రాజశేఖర్, ఆసిఫ్ అలీ, కమలాకర్ ఉన్నారు.

రేపు జిల్లా, జోనల్ స్థాయి రెజ్లింగ్ సెలక్షన్స్

నిర్మల్‌రూరల్: ఎస్‌జీఎఫ్ జిల్లా, జోనల్ స్థా యి (ఉమ్మడి ఆదిలాబాద్) అండర్ 14, 17 సెలక్షన్లు శనివారం భైంసా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. భైంసాలోని వేదం తపోవన్ స్కూల్‌లో ఎంపిక పోటీలు ని ర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం నిర్వహణ కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయుడు నఫీఖాన్‌ను సెల్ నం. 94409 57385లో సంప్రదించాలని సూచించారు.

గుడుంబా పట్టివేత

కడెం: మండలంలోని చిట్యాల్, లక్ష్మీసాగర్‌లో గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈదాడుల్లో 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గతంలోనూ పట్టుబడిన షేక్ సల్మా, బానావత్ గంగుబాయిలను తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేశారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది రశీద్‌ఖాన్, గౌతం, భాస్కర్, హరిశ్, కల్పన ఉన్నారు.

సమ్మె శిబిరంలో పొలాల అమావాస్య


ఆవుకు పూజ చేసి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌రూరల్: తమ డిమాండ్ల సాధనకు సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరింది. దీక్ష శిబిరంలో గురువారం పొలాల అమావాస్య జరుపుకుని నిరసన తెలిపారు. ఉద్యోగులు తయారుచేసిన మట్టి జోడెద్దులకు పూజలు చేశారు. దీక్ష శిబిరం బయట ఆవుకు పూజలు నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు పీఆర్టీ యూ లక్ష్మణచాంద, మామడ మండలాల అధ్యక్ష, ప్రధాన కా ర్యదర్శులు మిట్టపల్లి నరసయ్య, పరమేశ్వర్, బచ్చు శ్రీనివాస్, సురేష్‌కుమార్, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూమన్నయాదవ్, ఎఫ్‌ఏసీ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

ఆదివాసీ మహిళకు సినీ నటుడు ఆర్థిక సాయం


రూ.లక్ష చెక్కు అందిస్తున్న నటుడు విజయ్‌దేవరకొండ

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామానికి చెందిన పేద ఆదివాసీ మహిళ ఆత్రం పారుబాయికి గురువారం హైదరాబాద్‌లో నటుడు విజయ్‌దేవరకొండ తన నివాసగృహంలో రూ.లక్ష ఆర్థిక సాయంగా చెక్కును అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కోటి రూపాయల సాయం అందజేసినట్లు విజయదేవరకొండ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా సభ్యుడు నక్క గణేష్ తెలిపారు. ఇందులో భాగంగానే మల్యాల్ గ్రామానికి చెందిన ఆత్రం పారుబాయికి ఆర్థిక సాయం అందజేసినట్లు చెప్పాడు. పారుబాయి భర్త మరణంతో కూలీ పనులు చేసుకుంటూ తన నలుగురు కూతుర్లను పోషించుకుంటుంది. కార్యక్రమంలో మల్యాల్ సర్పంచ్ లావణ్యరాజు పాల్గొన్నారు.